సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 12 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.36 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 755 టన్నులు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.20
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.4.50, సరాసరిన రూ.10 ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
36.1°/11.2°
జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చాలా ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో గాలివేగం పెరిగింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నెట్టికంటుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి



హైకోర్టు జడ్జికి తీర్థ ప్రసాదాలు, పట్టు వస్త్రాలు అందజేస్తున్న ఆలయ అధికారులు

గుంతకల్లు రూరల్: హైకోర్టు జడ్జి బి.శ్యాంసుందర్ కుటుంబ సమేతంగా శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. జడ్జి కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి.. స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, ఫొటో జ్ఞాపికను జడ్జికి అందజేశారు.

వివిధ శాఖల్లో ఖాళీల వివరాలు కోరిన సర్కారు

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని క్యాడర్ల పోస్టుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. కొన్ని పదోన్నతుల ద్వారా, మరికొన్ని రాత పరీక్షల ద్వారా భర్తీ చేసిన సర్కారు.. తాజాగా మిగిలిన పోస్టులు ఎన్ని ఖాళీగా ఉన్నాయో తెలపాలంటూ అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఆయా శాఖధిపతులు తమ శాఖల్లో ఖాళీ పోస్టుల వివరాలతో సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం. మిగిలిన శాఖాధిపతులు కూడా ఒకట్రెండు రోజుల్లో జాబితా రూపొందించి ప్రభుత్వానికి పంపే పనిలో నిమగ్నమై ఉన్నారు.

పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి

- కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి
- కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ 'స్పందన' వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ బసంత్‌కుమార్, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, ఇంటర్ విద్య ఆర్ఐఓ సురేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారుల పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. జిల్లాలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 9,307 మంది, సెకండ్ ఇయర్ విద్యార్థులు 12,597 మంది కలిపి మొత్తం 21,904 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. వీరి కోసం 39 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలు జరిగే రోజున కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించాలని, జిరాక్సు సెంటర్లు మూసి వేయించాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల కోసం ఉదయం 7 గంటల నుంచే బస్సులు తిప్పాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించాలన్నారు. కేంద్రాల వద్ద 108 వాహనం, ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. 13న (సోమవారం) జరగనున్న పోలింగ్ కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం పోలింగ్ సామగ్రి పంపిణీ చేయనుండగా, ఆ రాత్రే అధికారులు పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించిన పోలీసు శాఖ ఈ మేరకు సిబ్బందిని నియమించింది.

- రేపే ఎమ్మెల్సీ ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ముగిసిన ప్రచార ఘట్టం
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



ర్యాండమైజేషన్ చేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్



ఎన్నికల సామగ్రి పంపిణీకి చిన్నపల్లి పాఠశాల ఆవరణలో ఏర్పాట్లు ఇలా..

సాక్షి, పుట్టపర్తి: పెద్దల పోరుకు సమయం ఆసన్నమైంది. శనివారం సాయంత్రంతో బహిరంగ ప్రచారానికి తెర పడింది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సోమవారం ఎన్నికలు జరగనున్నాయి. రెండు స్థానాలకు మొత్తం 61 మంది పోటీలో ఉన్నారు. పట్టభద్రుల స్థానానికి 49 మంది, ఉపాధ్యాయ స్థానానికి 12 మంది బరిలో నిలిచారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల పరిధిలో జరిగే ఎన్నికలకు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే రెండుసార్లు శిక్షణ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

కట్టుదిట్టమైన భద్రత..
ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా జరిగేలా అధికారులు కృషి చేస్తున్నారు. పోలీసు అధికారులను సమన్వయం చేసుకుని ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి (అనంతపురం కలెక్టర్) సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఇప్పటికే పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో పట్టభద్రుల ఎన్నికలకు 54 పోలింగ్‌కేంద్రాలు, ఉపాధ్యాయ ఎన్నికలకు 32 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికీ ఓ మైక్రో అబ్జర్వర్ చొప్పున రెండు ఎమ్మెల్సీ స్థానాలకు గానూ 86 మందిని నియమించారు.

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్లు ఇలా..

జిల్లా	పట్టభద్ర ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు	ఉపాధ్యాయ ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
కర్నూలు	61,633	74	5,391	27
నంద్యాల	54,929	61	4,426	15
అనంతపురం	68,341	84	5,464	33
శ్రీసత్యసాయి	43,310	54	3,348	32
వైఎస్సార్	81,317	93	7,461	38
అన్నమయ్య	20,594	22	1,958	30
మొత్తం	3,30,124	388	28,148	175

ముమ్మరంగా ఏర్పాట్లు..
ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు అవసరమైన సామగ్రి సిద్ధం చేశారు. ఆదివారం పుట్టపర్తి చిన్నపల్లి ఉన్నత పాఠశాలలో పోలింగ్ సామగ్రిని ఎలక్షన్ సిబ్బందికి అందజేయనున్నారు. పట్టభద్రుల స్థానం నుంచి ఎక్కువ మంది పోటీ పడుతుండటంతో జంబో బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ప్రాథమిక చికిత్స, నిలుచునేందుకు తగిన నీడ తదితర వసతులు కల్పించారు. అధిక ఓటర్లు ఉండే సెంటర్లలో బారికేడ్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు.

కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ..
పోలింగ్ రోజున ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రతి రెండు గంటలకు ఓసారి నమోదైన పోలింగ్ శాతం తెలుసుకోవడంతో పాటు ఆయా కేంద్రాల్లో పోలింగ్ జరుగుతున్న విధానాన్ని పర్యవేక్షిస్తారు. ఎక్కడైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే సమీపంలోని సిబ్బందిని అప్రమత్తం చేస్తారు. జిల్లా కమాండ్ కంట్రోల్ నుంచి ఉన్నతాధికారులు ఎన్నికల పర్యవేక్షణ చేస్తారు.

పోటీలో ఉన్నవారు వీరే...
పట్టభద్రుల స్థానం: వెన్నపూస రవీంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ), భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి (టీడీపీ), పోతుల నాగరాజు (పీడీఎఫ్)
ఉపాధ్యాయ స్థానం: ఎంవీ రామచంద్రారెడ్డి (వైఎస్సార్‌సీపీ), ఒంటేరు శ్రీనివాసరెడ్డి (ఏపీటీఎఫ్), కత్తి నరసింహారెడ్డి (యూటీఎఫ్)

గుర్తింపు కార్డు తప్పనిసరి..
పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే పట్టభద్రులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకువెళ్లాలని కలెక్టర్ బసంత్‌కుమార్ సూచించారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ ఉంటుందన్నారు. ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు అందించే గుర్తింపు కార్డులు, స్థానిక, ప్రైవేటు సంస్థలు ఉద్యోగులకు జారీ చేసే గుర్తింపు కార్డు తీసుకు వెళ్లవచ్చన్నారు. డిప్లొమా, డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా గుర్తింపుకార్డుగా చూపవచ్చన్నారు.

13న ఉద్యోగులకు ప్రత్యేక సెలవు..
పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఈనెల 13వ తేదీన ప్రత్యేక సెలవు (స్పెషల్ క్యాజువల్ లీవ్) మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందన్నారు.

నంబర్ మాత్రమే వేయాలి..

పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నిలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ బృందాల ఎంపికకు నిర్దేశించిన ర్యాండ్ మైజేషన్ (క్రమబద్ధీకరణ) ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యతా క్రమంలో ఎంత మంది అభ్యర్థులు పోటీలో ఉంటే పేర్లకు ఎదురుగా ఉన్న బాక్సుల్లో 1, 2 ,3, 4 ఇలా అంకెలను మాత్రమే బ్యాలెట్ పేపర్‌పై వేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి అందజేసే వైలెట్ పెన్నుతో మాత్రమే అంకెలు వేయాలన్నారు.

పటిష్ట బందోబస్తు



అమరాపురం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

పుట్టపర్తి అర్బన్/అమరాపురం: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకూ ఎవరూ గుంపులుగా ఉండకూడదన్నారు. పోలింగ్ బూతుల్లో ఫొటోలు, వీడియోలు తీయడం నిషిద్ధమన్నారు. ఓటర్లు, ఏజెంట్లు, అభ్యర్థులు ఫోన్లు, ఐపాడ్, ట్యాబ్‌లను పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లకూడదన్నారు.

బందోబస్తుకు 713 మంది సిబ్బంది
ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు ఐదుగురు డీఎస్పీలు, ఏడు మంది సీఐలు, 34 మంది ఎస్ఐలు, 72 మంది ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుళ్లు, పలువురు కానిస్టేబుళ్లు, హోంగార్డులతో కలిపి మొత్తం 713 మందిని నియమించామన్నారు. అంతకుముందు ఆయన అమరాపురం జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.



గరుడవాహనంపై ఊరేగుతున్న లక్ష్మీ నారసింహుడు

గరుడవాహనంపై ఖాద్రీశుడు

కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదో రోజైన శనివారం ఖాద్రీశుడు గరుఢారూఢుడై తిరువీధుల్లో దర్శనమిచ్చారు. ఉత్సవాలకు అధిపతి అయిన బ్రహ్మ... ప్రజల కోరిక మేరకు తన ఇష్ట వాహనమైన గరుత్మంతుని నారసింహునికి వాహనంగా మరోసారి పంపుతారని, దీన్నే ప్రజా గరుడసేవ..మలి గరుడసేవ అని కూడా అంటారని అర్చకులు వివరించారు. మోహినీ ఉత్సవంలో భాగంగా శ్రీవారు శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకూ గ్రామంలో ఊరేగారు. శనివారం రాత్రి 7 గంటలకు ఆలయానికి చేరుకున్న శ్రీవారికి అర్చకులు నిత్యపూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రి గరుడవాహనంపై తిరువీధుల్లో విహరించారు. పెద్ద సంఖ్యలో రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తాదులు తమ ఇలవేల్పును దర్శించుకుని తరించారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీవారు తెల్లటి ఐరావతం (గజవాహనం) పై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

దిగజారుడు రాజకీయం

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ డీలా..
- పీడీఎఫ్ అభ్యర్థి తరఫునా ప్రచారం చేస్తున్న వైనం
- తమ అభ్యర్థి ఓటమి ఖరారైందన్న టీడీపీ నాయకులు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఎదుర్కోలేక సీపీఐతో దోస్తీ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: తొలుత బరిలో మేమున్నాం అంటూ జబ్బలు చరిచిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు బొక్క బోర్లా పడింది. పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవలేమని రూఢీ అయ్యాక కాడిని కిందేశారు. కమ్యూనిస్టులతో పరస్పర సహకారానికి తెర తీశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శనివారం ఉరవకొండలో మీడియాతో మాట్లాడుతూ అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఓటమే ధ్యేయంగా టీడీపీతో కలిసి పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. మొన్న శ్రీసత్యసాయి జిల్లాకు వచ్చిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తమ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తే, కమ్యూనిస్టులు బలపరుస్తున్న పీడీఎఫ్ అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓటు వేయండంటూ అభ్యర్థించారు. టీడీపీ, సీపీఐ కుమ్మక్కు రాజకీయం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

టీడీపీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి..
ఉమ్మడి అనంతపురం జిల్లా అంటే ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచుకోట అనేవారు. అలాంటిది 2019 సాధారణ ఎన్నికల్లో 14 ఎమ్మెల్యే సీట్లకు 12 సీట్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెల్చుకుంది. దీంతో కంచుకోటలన్నీ బీటలు వారాయి. మరో ఏడాదిలో సాధారణ ఎన్నికలు జరగనుండగా...దానికి రిహార్సల్స్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికలంటూ ముందు చెప్పి.. ఇప్పుడేమో కాడిని కిందేయడంపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

రెండు సీట్లలోనూ విజయ ఢంకా మోగించాలని...
వైఎస్సార్‌సీపీ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డిని, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామచంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు కృషి చేశాయి. గత పదిరోజులుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అలుపెరగని ప్రచారం చేశారు. జనంలో మమేకమయ్యారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించగలిగారు. ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చిన వైనాన్ని ఆధారాలతో చూపించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం నల్లేరుమీద నడకే అని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు.



క్లుప్తంగా

వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మందికి గాయాలు

రొళ్ల: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో తొమ్మిది మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం జీఎస్ పాళ్యం గ్రామ సమీపాన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో హిమాచల, తిప్పేస్వామి, నరసయ్య, గోవిందప్ప గాయపడ్డారు. అలాగే బంద్రేపల్లి గ్రామ సమీపాన ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో శివమ్మ, పునీత్, ప్రవీణ్, హనుమంతప్ప, మంజునాథ్ గాయపడ్డారు. క్షతగాత్రులను ఆయా ప్రదేశాల నుంచి ప్రైవేట్ వాహనాల్లో రొళ్ల పీహెచ్సీకి స్థానికులు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో మడకశిరలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వీరిలో హనుమంతప్ప పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్ణాటకలోని తుమకూరులో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదాలకు కారణంగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెలుగు చూసింది. ఘటనలపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) లోకేష్ (ఫైల్)

మడకశిర(అగళి): సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ విద్యార్థి నీట మునిగి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అగళి మండలం మధూడి గ్రామానికి చెందిన భీమప్ప ఒక్కగానొక్క కుమారుడు లోకేష్ (15), తన ముగ్గురు స్నేహితులతో కలసి గ్రామ సమీపంలో ఉన్న సువర్ణముఖి నదిలో శనివారం ఉదయం ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈత కొడుతూ లోతైన ప్రాంతానికి వెళ్లి లోకేష్ బురదలో చిక్కుకుని ఎంత సేపటికీ బయటకు రాలేదు. విషయాన్ని స్నేహితులు ద్వారా తెలుసుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని లోకేష్ ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. చాలా సేపటి తర్వాత బురదలో చిక్కుకున్న లోకేష్‌ను గుర్తించి వెలికి తీశారు. అప్పటికే ఊపిరి అందక బాలుడు మృతి చెందాడు. ఘటనపై అగళి ఎస్ఐ లావణ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అల్లా మార్గం అనుసరణీయం

- ఇస్తెమాలో మౌలానాలు
- అట్టహాసంగా ప్రారంభమైన జిల్లా స్థాయి ఇస్తెమా



ఇస్తెమాకు వేల సంఖ్యలో హాజరైన ముస్లింలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అల్లా మార్గం అనుసరణీయమని మౌలానాలు దావూద్, ఇర్ఫాన్, నిసార్, జమాలుద్దీన్ అన్నారు. అనంతపురం నగర శివారులోని ఆటో నగర్ వేదికగా జిల్లా స్థాయి ఇస్తెమా శనివారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమైంది. వివిధ జిల్లాలకు చెందిన వేలాది మంది ముస్లింలు తరలిరావడంతో ఆ ప్రాంతం జనసంద్రమైంది. విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా నిర్వాహకులతో పాటు నగర పాలక సంస్థ, రాప్తాడు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విభాగాలుగా వలంటీర్లను ఏర్పాటు చేసిన సహకరిస్తున్నారు. వజూ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, మూత్రశాలలు ఏర్పాటు చేశారు. భోజనాలు, నీళ్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

అల్లా కృపతో అన్నీ సాధ్యం..

బెంగుళూరు, హిందూపురం, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ఉలెమాలు ఆధ్యాత్మిక ప్రసంగం కొనసాగిస్తూ.. అల్లాహ్ కృప ద్వారా ఇహ, పర లోకాల్లో అన్నీ సమకూరుతాయన్నారు. అయితే అహం మనిషిని అన్ని విధాలుగా నష్టపరుస్తుందని, ఇందుకు ముస్లిం మత గ్రంథాల్లో పేర్కొన్న సులేమాన్ అలైహిస్సలాం కథనమే నిదర్శనమన్నారు. 'ప్రపంచంలోనే తనను మించిన గొప్ప ధనవంతుడు లేనే అహంతో సులేమాన్ అలైహిస్సలాం.. ఈ లోకంలో ఉన్న వారందరికీ ఆహారాన్ని అందించాలనుకున్నాడు. అయితే ఆయన వండించిన ఆహారం మొత్తాన్ని సముద్రంలోని ఓ చేప రెండు ముద్దల్లో తినేసింది. అనంతరం ఆ చేప ఆయనతో మాట్లాడుతూ.. తనకు అల్లా కృపతో ఇలాంటి ఆహారం కడుపు నిండా మూడుపూటలా అందుతోందని తెలిపింది. ఇది విన్న రాజులోని అహం నశించి, అల్లా తలుచుకుంటే ఏదైనా సమకూరుతుందని, తాను కేవలం నిమిత్తమాత్రుడేనని గ్రహించి, సమస్త జీవరాశి అభ్యున్నతికి పాటు పడుతూ వచ్చారు'. ఈ కథనంలో దాగున్న రహస్యాన్ని గ్రహించి అహం వీడి అల్లా మార్గంలో నడవాలని ఉలెమాలు పిలుపునిచ్చారు.

శాంతికి చిహ్నం ఇస్లాం..

ఇతరులను ఇబ్బందులకు గురి చేయడం, ఆస్తిని, ఇతర వస్తువులను లాక్కోవడాన్ని ఇస్లాం పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఉలెమాలు అన్నారు. శాంతికి చిహ్నం ఇస్లాం అనే వాస్తవాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అల్లాహ్ ఆదేశాల మేరకు మహమ్మద్ ప్రవక్త సాగించిన బోధనలను ప్రతి ముస్లిమూ తప్పనిసరిగా పాటించాలన్నారు. భక్తి మార్గంలో నడుస్తూ క్రమం తప్పకుండా నమాజు చేయడం, ఇతరులకు సాయం చేయడం ఇస్లాం సిద్ధాంతమన్నారు. అల్లా ఆదేశం లేనిదే ఈ సృష్టిలో ఏదీ జరగదన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ అల్లాహ్ గొప్పతనాన్ని ప్రశ్నించడం సరికాదన్నారు. కార్యక్రమంలో అమీర్‌సాబ్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కచేరి



కచేరి నిర్వహిస్తున్న సత్యసాయి సేవా సంస్థల యువకులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి జాతీయ లీడర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో నిర్వహించిన సంగీత కచేరి అలరించింది. సత్యసాయి సేవాలను, ఆధ్యాత్మిక తత్వాన్ని కీర్తిస్తూ యువకులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

వైభవం... శ్రీవారి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

చిలమత్తూరు: మండలంలోని సోమఘట్టలో వెలసిన మధుగిరి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు, అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారసింహస్వామి ఉత్సవమూర్తులను పల్లకీపై తీసుకువచ్చి రథంలో అధిష్టింపజేశారు. వేలాది భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని ముందుకు లాగగా.. సోమఘట్ట నుంచి విచ్చేసిన ఆయగాళ్లు తెడ్లు వేశారు. ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, వేణురెడ్డి, కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, బెస్ట్ యూనివర్సిటీ చైర్‌పర్సన్ డా.రూపా వాసుదేవన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సాయంత్రం వైఎస్సార్‌సీపీ మహిళానేత చౌళూరు మధుమతిరెడ్డి ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి మద్దతివ్వండి



ఎన్జీఓ కార్యాలయంలో ఓటు అభ్యర్థిస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

హిందూపురం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న సంక్షేమ పాలన, రాష్ట్రాభివృద్ధికి చేపట్టిన చర్యలను గుర్తించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి కోరారు. శనివారం ఆయన హిందూపురంలో పర్యటించి, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, పట్టభద్రులను కలసి, ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తూ వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి రాగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ లక్షలాది మంది నిరుద్యోగులకు సీఎం వైఎస్ జగన్ ఉద్యోగ అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఓ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు శ్రీకారం చుట్టారన్నారు. ఎన్ని ఆర్థిక ఒడిదుడుకులున్నా.. ప్రజాసంక్షమాన్నీ ఏనాడూ ఆపలేదన్నారు. టీడీపీ నేతల అబద్ధపు ప్రచారాలు నమ్మబోరాదన్నారు. కార్యక్రమంలో ఏపీపీ ఇందాద్, కౌన్సిలర్ ఇర్షాద్‌అహమ్మద్, పార్టీ నాయకులు గుడ్డం దాదు, వరణ్ తదితరులు పాల్గొన్నారు.


కంబాల రాయుడే కదిరి నరసింహుడు



కంబాలరాయుని కొండ మీదున్న సిద్ధుల దొన



కొండపై ఉన్న శ్వేద తీర్థం



కదిరి: దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం మహా విష్ణువు వివిధ రూపాల్లో సాక్షాత్కరించారు. ఇందులో ఒకటి నారసింహుడు. ముల్లోకాలను ముప్పుతిప్పలు పెట్టిన హిరణ్య కశ్యపుడిని అంతమొందించేందుకు సగం మనిషి, సగం సింహ రూపంలో అవతరించిన నారసింహుడుని కంబాల రాయుడు అని కూడా భక్తులు పిలుస్తుంటారు. కంబం అంటే స్తంభం. స్తంభం నుంచి ఉగ్రరూపంతో భువిపైకి వచ్చిన నారసింహుడు.. హిరణ్య కశ్యపుడిని అంతమొందించిన తర్వాత గాండ్లపెంట మండలం గొడ్డువెలగల సమీపంలోని కొండపై అవతరించారని ఈ ప్రాంత ప్రజల నమ్మకం. ఇందుకు అక్కడి కొండపై స్వామి పాదాలు వెలిసినట్లు పురాణాలు సైతం చెబుతున్నాయి. ఇదే కొండపై శ్వేద తీర్థం, శిద్దుల దొన ఉన్నాయి. ఎన్ని కరువు కాటకాలొచ్చినా నీరు ఇంకిపోకుండా ఉండడం ఈ దొనల ప్రత్యేకత.

ప్రమాదంలో రైతు మృతి





మృతుడి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ (ఇన్‌సెట్) మీసాల ఆంజనేయులు (ఫైల్)

రొద్దం: ఎడ్ల బండిపై నుంచి కింద పడి ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం సానిపల్లికి చెందిన రైతు మీసాల ఆంజనేయులు.. శనివారం ఉదయం స్థానిక పెన్నానది నుంచి ఎద్దుల బండిలో ఇసుక వేసుకుని తురకలాపట్నం వైపు బయలుదేరాడు. మార్గమధ్యంలో పెద్దపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే ఎద్దులు బెదిరి పరుగు తీయడంతో బండిపై నుంచి ఆంజనేయులు కిందపడడంతో అతని మీదుగా బండి చక్రాలు దూసుకెళ్లాయి. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన మరికొందరు రైతులు వెంటనే స్పందించి ఆంజనేయులును పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న పెనుకొండ ఎమ్మెల్యే ఎం.శంకరనారాయణ.. ఆ గ్రామానికి చేరుకుని ఆంజనేయులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులును పరామర్శించారు. పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పని చేస్తున్న ఆంజనేయులు మృతి తీరని లోటుగా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, సర్పంచ్ పరమేష్, ఎంపీటీసీ శంకరరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ రాజారెడ్డి, కేపీ శ్రీనివాసులు ఉన్నారు. కాగా, ఆంజనేయులు మృతిపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై పార్లమెంటులో చర్చించాలి

- ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి



మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి

పుట్టపర్తి అర్బన్: అగ్రవర్ణ పేదలకు అమలవుతున్న పది శాతం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో చర్చించి ఏకాభిప్రాయం సాధించాలని పార్లమెంటు సభ్యులకు ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి సూచించారు. శనివారం పుట్టపర్తికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు సమర్థించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కొన్ని పార్టీలు, ప్రజాసంఘాలు వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లు అడ్డుకుంటే దేశ వ్యాప్తంగా భారీ ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరుపేద ఓసీల సమస్యలపై త్వరలో దేశ వ్యాప్తంగా వివిధ నగరాల్లో జాతీయ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సామాజిక వివక్ష అంతరించి ఆర్థిక వివక్ష కొనసాగుతున్న నేపథ్యంలో ఆర్థిక వెనుకబాటు ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి అనేక కమిషన్లు సిఫారసు చేశాయన్నారు. నిరుపేద ఓసీలకు రిజర్వేషన్లతో పాటు రూ.లక్ష కోట్లతో ఓసీ కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు.

మద్యం దుకాణాల బంద్

పుట్టపర్తి అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం 4 గంటల వరకూ మద్యం దుకాణాలను బంద్ చేయాలని నిర్వాహకులను కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

'పోలీస్ స్పందన' రద్దు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈ నెల 13న జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఈ మేరకు ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి




నృసింహాలయంలో భక్తుల రద్దీ

- అడుగడుగునా అన్నదానానికి ఏర్పాట్లు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నారసింహుడి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన రథోత్సవం ఈ నెల 13న (సోమవారం) జరగనుంది. ఇందుకోసం ఆలయ, పోలీస్, మున్సిపల్, ఇంకా పలు ప్రభుత్వ శాఖల అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తాదులతో ఆలయ ప్రాంగణం రథోత్సవానికి రెండు రోజుల ముందే కిటకిటలాడుతోంది. ఆలయంలో అద్దె గదులు ఖాళీగా లేకపోవడంతో భక్తులు నేలపైనే నిద్రిస్తున్నారు. పట్టణంలోని లాడ్జీల్లో సైతం గదులు ఖాళీగా లేవన్న సమాధానం వినిపిస్తోంది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి 7.45 గంటల మధ్య రథోత్సవం ప్రారంభించేందుకు శుభ ముహూర్తంగా అర్చక పండితులు నిర్ణయించారు. రథం లాగేందుకు ఆనవాయితీగా వచ్చే కుటాగుళ్ల, బేరిపల్లి, నాగిరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి, మూర్తిపల్లికి చెందిన భక్తులను నేరుగా వెళ్లి ఆహ్వానించామని ఆలయ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణతో పాటు ఈఓ పట్టెం గురుప్రసాద్‌లు తెలిపారు. రథోత్సవం నాడు పట్టణంలో సుమారు 80 చోట్ల అన్నదానం చేసేందుకు దాతలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు: ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు డీఎస్పీ భవ్యకిశోర్ తెలిపారు. పులివెందుల వైపు నుంచి బెంగళూరు వెళ్లాల్సిన వాహనాలను కుటాగుళ్ల, మలకవేముల క్రాస్ మీదుగా ఓడి చెరువువైపు మళ్లించామన్నారు. అలాగే బెంగళూరు వైపు నుంచి కదిరి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల వాహనాలను హిందూపురం రోడ్‌లో వ్యవసాయ పరిశోధనా స్థానం వరకు మాత్రమే అనుమతిస్తామన్నారు. పులివెందుల, అనంతపురం వైపు నుంచి వచ్చే భక్తుల వాహనాలను ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. తిరువీధుల్లోకి ఎట్టిపరిస్థితుల్లో ఏ వాహనాన్నీ అనుమతించేది లేదని డీఎస్పీ స్పష్టం చేశారు.

యువకుడి దుర్మరణం



జబీవుల్లా (ఫైల్)

కొత్తచెరువు: అతి వేగం ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... కొత్తచెరువు గ్రామానికి షౌకత్ కుమారుడు జబీవుల్లా (19) శనివారం తన స్నేహితుడు మారుతితో కలసి ద్విచక్ర వాహనంపై పెనుకొండకు బయలుదేరాడు. లోచర్ల సమీపంలోకి చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక ఎదురుగా కట్టెల లోడుతో వెళుతున్న ఆటోను వెనుక నుంచి ఢీకొన్నారు. ఘటనలో జబీవుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మారుతిని పోలీసులు 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

జనావాసాల్లోకి చిరుతలు!



గుట్టపై సంచరిస్తున్న చిరుతలు

కళ్యాణదుర్గం: స్థానిక బలిజ కల్యాణమంటపం సమీపంలోని జనావాసాల్లోకి శనివారం ఉదయం 6 గంటలకు రెండు చిరుతలు ప్రవేశించి, స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాయి. కల్యాణమంటపం శివారులను ఉన్న గుట్టపై నుంచి చిరుతలు కాలనీలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. జనావాసాల్లోకి వచ్చిన చిరుతలను గమనించిన స్థానికులు వెంటనే ఇళ్లలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. ఓ ఇంటి వద్ద ఉన్న పెంపుడు కుక్కలను చిరుతలు నోట కరుచుకుని వెళ్లాయి. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. వారం రోజులుగా తరచూ రాత్రి వేళల్లో వీధుల్లో చిరుతలు సంచరిస్తున్నాయని ఈ సందర్భంగా స్థానికులు వివరించారు. జనావాసాల్లోకి చిరుతలు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, సమాచారం అందుకున్న అటవీ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. రేంజ్ ఆఫీసర్ రాంసింగ్ ఆదేశాలలో చిరుతల ఆచూకీ కోసం గుట్టపై శనివారం సాయంత్రం సెక్షన్ ఆఫీసర్ షనవాజ్, బీట్ ఆఫీసర్ నాగేనాయక్, సిబ్బంది గాలింపు చేపట్టారు. జనావాసంలోకి చిరుతలు చొరబడకుండా గుట్టకు ఓ వైపు వలను ఏర్పాటు చేశారు. బోనులు ఏర్పాటు చేసి చిరుతలను బంధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.